సాక్షి
రంగారెడ్డి

ఆదివారం | 27 | ఆగస్టు | 2023



అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



సభకు తరలివచ్చిన పార్టీ శ్రేణులు

కాంగ్రెస్.. ఫుల్ జోష్



నేతల అభీష్టం మేరకు సెల్‌ఫోన్ టార్చ్‌లైట్లు వెలిగించి చూపిస్తున్న కార్యకర్తలు





ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్, కళాకారుల ఆటాపాట

'ప్రజాగర్జన' సక్సెస్

- భారీగా తరలివచ్చిన జనం
- ఉత్సాహం నింపిన ప్రముఖుల ప్రసంగాలు
- సభ విజయవంతంతో నేతల సంతృప్తి

చేవెళ్ల/మొయినాబాద్/శంకర్‌పల్లి/మొయినాబాద్ రూరల్: చేవెళ్ల వేదికగా కాంగ్రెస్ నిర్వహించిన 'ప్రజాగర్జన' సభ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు. సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో ప్రధాన రహదారిపై డివైడర్‌పై ఎక్కి సభను వీక్షించారు. రోడ్లపైనే నిలబడి నేతల ప్రసంగాలను విన్నారు. జై కాంగ్రెస్ అన్న నినాదాలు మిన్నంటాయి. ఊహించినదానికంటే పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

దాదాపు నాలుగంటలపాటు సభ..

ముందుగా ప్రకటించిన ప్రకారం సాయంత్రం 4 గంటలకు సభ ఉంటుందని ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రాత్రి 8.30 గంటలకు వరకు సభలోనే కనిపించారు. సభా వేదికపై నేతల స్పీచ్‌లే సుమారు 2 గంటలపాటు కొనసాగాయి. ప్రముఖుల ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు.

పార్టీలో చేరిన ఆర్మూర్ నేతలు

చేవెళ్ల సభలో ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన గోవర్ధన్, మహిపాల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ఓయూకు చెందిన కాట శ్రీనివాస్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతించారు.

గద్దర్‌కు ఘన నివాళి

సభలో ప్రజాగాయకుడు గద్దర్‌కు మల్లికార్జున ఖర్గే, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ శేణులంతా కలిసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని.. కేసీఆర్‌ను గద్దె దించాలనే గద్దర్ చివరిసారిగా చేసిన సందేశం మాటలను మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సెల్‌ఫోన్ ద్వారా మైకులో కార్యకర్తలకు వినిపించారు.

బీసీలకు న్యాయం జరగాలి

అరశాతం ఉన్నవారు తెలంగాణ రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని.. 54 శాతం ఉన్న బీసీలకు కూడా న్యాయం జరగాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంతరావు అన్నారు. హైదరాబాద్‌లోని గోషామహల్‌లో బందీ అయి ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా నిలబెట్టేందుకు పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కళాకారుల ధూంధాం..

సభకు వచ్చిన జనవాహినిని ఆకట్టుకునేలా కళాకారుల ధూంధాం పాటలు మార్మోగాయి. ఆద్యంతం తమ ఆటపాటలతో అలరించారు. సభ జరుగుతున్న సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం పడే పరిస్థితి కనిపించింది. దీంతో 12 అంశాలను త్వరగా చదివి ముగించారు. సభలో పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రులు ప్రసాద్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మొద్దు



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో చేప పిల్లలను వదలుతున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

- అభివృద్ధి చేసేవారికే ఓటు వేయాలి
- కులవృత్తిదారులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం
- మత్స్యసంపదపై పూర్తి హక్కులు మత్స్యకారులవే..
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చి మాయమాటలు చెప్పి బయటపడే వారిని నమ్మి మోసపోవద్దని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి కృషిచేస్తున్న వారికి అండగా నిలబడాలన్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో శనివారం స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కులవృత్తులపై ఆధారపడి జీవించేవారు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని పేర్కొన్నారు. మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి చెందాలని 2016–17లో రూ.పది కోట్లతో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆరు వేల చెరువుల్లో వాటిని వదలిపెట్టగా, ఈసారి రూ.110 కోట్లు వెచ్చించి 26 వేల చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను వదిలిపెడుతున్నట్లు తెలిపారు. రూ.రెండు కోట్లతో ఆధునిక హంగులతో ఇక్కడ చేపల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని, దీంతో ఈప్రాంతంలోని మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మత్స్య సంపదపై పూర్తి హక్కులు మత్స్యకారులవేనని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు శేరిగూడ వద్ద రూ.2 కోట్లతో నిర్మించనున్న చేపల మార్కెట్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, సీతారాంపేటలో రూ.1.80 కోట్లతో నిర్మించిన 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల పీఏసీఎస్ గొడౌన్‌కు ప్రారంభోత్సవం చేశారు. హరితహారంలో భాగంగా జేబీ వెంచర్‌లో మొక్కలు నాటారు. రూ.1.85 కోట్లతో కొన చెరువు కట్ట నుంచి ఉప్పరిగూడ వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 36 ఏళ్లుగా చెరువులోకి చుక్కనీరు రాలేదని, హరీశ్‌రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడు రూ.15 కోట్లు కేటాయించడంతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. దాని ఫలితంగానే పెద్ద చెరువులోకి వర్షపునీరు చేరి నిండుకుండాలా మారి మత్స్యకారులకు జీవనోపాధిగా మారిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ రవీంద్రసాగర్, ఉప్పరిగూడ సర్పంచ్ బూడిద రాంరెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, అడిషనల్ డైరెక్టర్ రాథోడ్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారిణి సుకీర్తి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మత్స్య సొసైటీ అధ్యక్షుడు దివిటి రాములు తదితరులు పాల్గొన్నారు.



థాంక్స్ ఇస్రో

చంద్రయాన్–3 విజయవంతమైన నేపథ్యంలో కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎదుట చంద్రయాన్–3 నమూనాను ప్రదర్శించి 'థాంక్స్ ఇస్రో' ఆకారంలో విద్యార్థులు కూర్చుని వినూత్నంగా అభినందనలు తెలిపారు.

– మీర్‌పేట

చెరువుల సుందరీకరణకు కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి


- మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో రూ.47 కోట్లతో చెరువుల సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాలలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. ఆయా కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రూపొందించిన గృహలక్ష్మి పథకం ద్వారా నిరుపేదలకు రూ.3 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, వై.శివకుమార్, అనిత, మౌనిక, రవినాయక్, ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ మాజీ వీసీ నవనీతరావు కన్నుమూత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ వీసీ ప్రొ.నవనీతరావు (95) శుక్రవారం రాత్రి బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఆయన ఓయూ కెమిస్ట్రీ విభాగంలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేసి 1970లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. బోధన, పరిశోధనలో ప్రతిభను చాటుతూ 220 పరిశోధన వ్యాసాలను, 5 పుస్తకాలు రాశారు. ఆయన పర్యవేక్షణలో 24 మంది పరిశోధన విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 160 పరిశోధన వ్యాసాలను సమర్పించారు. ఓయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులుగా వివిధ పాలన పదవులు చేపట్టిన ప్రొ.నవనీతరావు.. యంగ్ సైంటిస్ట్ అవార్డులతో పాటు ఇతర అనేక అవార్డులను అందుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓయూకు రెండు పర్యాయాలు (1985–1991) ఆరు సంవత్సరాలుగా వైస్ చాన్స్‌లర్‌గా పదవిలో కొనసాగిన ఘనత ప్రొ.నవనీతరావుకు దక్కింది. ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ బంజారహిల్స్‌లోని నవనీతరావు నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

మొక్కలు నాటి సంరక్షించండి



ముకునూర్‌లో మొక్కలు నాటుతున్న జాన్‌వెస్లీ తదితరులు

ఇబ్రహీంపట్నం: మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ (పీఆర్ అండ్ ఆర్డీ) డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అన్నారు. ఒకరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రాయపోల్, ముకునూర్, దండుమైలారం, నెర్రపల్లి గ్రామాల్లో మొక్కలు నాటడంతోపాటు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ ఒక్కరోజే జిల్లాలో 4.20 లక్షల మొక్కలు నాటినట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ఉపాధి హామీ ఏపీడీ సక్రియా నాయక్, ఏపీఓ తిరుపతిచారి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంచాల: ఒకరోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లపల్లిగూడలో శనివారం పంచాయతీ రాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ వేస్లీ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ నీరజ, మంచాల ఎంపీడీఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు స్పాట్ అడ్మిషన్లు

యాచారం: మండల కేంద్రంలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలుర)లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఎంఈసీ, సీఈసీ మొదటి ఏడాదిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 28న (సోమవారం) స్పాట్ అడ్మిషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ కె.యాదయ్య శనివారం ఒక ప్రకటనతో పేర్కొన్నారు. పదో తరగతిలో 6.5 కంటే అధికంగా గ్రేడ్ల మార్కులు సాధించిన రెగ్యులర్ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు.

ఇంటర్ ఎంపీసీలో సీట్ల భర్తీకి రేపు స్పాట్ అడ్మిషన్స్

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల చేవెళ్లలో విద్యార్థినులకు ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్‌లో ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 10వ తరగతి జిరాక్స్ మెమోతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.

మా బిడ్డ జాడ చెప్పండి



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థి నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: కళాశాల హాస్టల్ నుంచి తమ కుమారుడు అదృశ్యమై వారం రోజులు గడుస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని బాధిత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి మిస్సింగ్‌కు యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ శనివారం స్టూడెంట్ యూనియన్లతో కలిసి ఆందోళన చేపట్టారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ విద్యాసంస్థల్లో డిప్లొమా సెకండియర్ చదువుతున్న ఆంజనేయులు ఈనెల 20న కళాశాలకు చెందిన హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. వారం రోజులుగా కుమారుడి జాడ లేకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు, యాజమాన్యం స్పందించి ఆచూకీ కనుక్కోవాలని విజ్ఞప్తి చేశారు.

వాస్‌దేవ్‌పూర్ సర్పంచ్ మృతి



చాందీ (ఫైల్)

కడ్తాల్: మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ సర్పంచ్ పాత్లావత్ చాందీ (78) శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ నేతలు బీక్యానాయక్, నర్సింహ, బీచ్యానాయక్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్‌లు శంకర్, పాండు, వెంకోబా, రాముడునాయక్, సేవ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ తదితరులు చాందీ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైనోప్లాస్టీపై అంతర్జాతీయ వర్క్‌షాప్



బంజారాహిల్స్: ముఖ సౌందర్యం, శ్వాస పీల్చుకోవడంలో సమస్యలు, నాసికా శస్త్ర చికిత్సల వంటి ఆధునిక పరిశోధన ఫలితాలపై చర్చించడంతో పాటు యువ వైద్యులకు రైనోప్లాస్టి శస్త్ర చికిత్సలపై శిక్షణ ఇచ్చేందుకు 8వ అంతర్జాతీయ రైనోప్లాస్టీ వర్క్‌షాప్‌ను శనివారం బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి ఓపీ విభాగంలో ప్రారంభించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వర్క్‌షాప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆస్పత్రి ఈఎన్‌టీ, ఫేషియల్ ప్లాస్టిక్ శస్త్ర చికిత్సల విభాగాధిపతి డాక్టర్ ఎన్. విష్ణుస్వరూప్‌రెడ్డి మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన వైద్యులు నిర్వహించే శస్త్రచికిత్సలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి యువ వైద్యులు తమ నైపుణ్యాన్ని మెరుగుదిద్దుకునే అవకాశం ఉందన్నారు. వర్క్‌షాప్‌లో సుమారు 150 మంది ఈఎన్‌టీ డాక్టర్లు పాల్గొన్నారు.

రేకులు తొలగించి వైన్స్‌లో చోరీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఫత్తేపురంలోని శ్రీ వెంకటేశ్వర వైన్స్‌లో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. వైన్స్ గదికి సంబంధించి రేకులు తొలగించి కౌంటర్‌లోని రూ.10వేల నగదు, 8 ఫుల్ బాటిళ్ల మందు ఎత్తుకెళ్లడంతో పాటు సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్, డీవీఆర్‌ను కూడా ఎత్తుకెళ్లారు. వైన్స్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని శంకర్‌పల్లి ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

దోస్త్ అడ్మిషన్లకు చివరి అవకాశం

ఇబ్రహీంపట్నం: దోస్త్ స్పెషల్ డ్రైవ్ కింద చివరి అవకాశంగా ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో కొన్ని సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు దోస్త్ స్పెషల్ డ్రైవ్‌కు దరఖాస్తులు పెట్టుకోవాలన్నారు.



ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్‌లో బీరప్ప స్వామి ఆలయంలో జరిగిన మహంకాళీ, బీరప్ప, కామరాతి, బొగ్గు పోచమ్మ దేవాతమూర్తుల విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో నిరాదరణకు గురైన ఆలయాలు నేడు పునరుద్ధరణకు నోచుకుంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, నాయకులు.. బీరప్ప, అంజయ్య, సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: బీరప్పగుడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

పోచమ్మ దేవాలయంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెంలోని పోచమ్మ దేవాలయంలో శనివారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సిద్దంకి క్రిష్టారెడ్డి, కాలనీ అధ్యక్షుడు గోవిందారెడ్డి, గౌరవ అధ్యక్షుడు రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, క్రిష్టయ్య, కార్యదర్శులు మజీద్ బాబా, శివగౌడ్, వినోద రాజు, సభ్యులు రవీందర్, అరుణ్, ఖజాబాబు, రవీందర్, వెంకట్ రెడ్డి, కిరణ్, రాజు, సంపత్, రోహిత్‌రెడ్డి, సాయి, కాలనీవాసులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కల్గించాడంటూ..

అర్జీదారుపై పీఎస్‌లో ఫిర్యాదు చేసిన డీటీ కృష్ణయ్య

కొందుర్గు: తన విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని కొందుర్గు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మండలంలోని చిన్నఎల్కిచర్లకు చెందిన ఓ భూమి విరాసతు విషయంలో అధికారులు తప్పుడు పట్టామార్పిడి చేశారని ఆరోపిస్తూ షాద్‌నగర్‌కు చెందిన అఫ్రోజ్ శనివారం డిప్యూటీ తహసీల్దార్‌పై మండిపడ్డారు. వారసుల వివరాలు తెలియకుండా పట్టా మార్పిడిఎలాచేస్తారని బూతులు తిట్టారు. ఈ విషయమై డీటీ కృష్ణయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కృష్ణయ్యను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- నందిగామ పెద్దకుంట తండాలో విషాదం
- పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

నందిగామ: ఇంటి రేకుల గొట్టానికి ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నందిగామ శివారు పెద్దకుంట తండాలో శుక్రవారం చోటుచేసుకోగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం వివరాలు.. పెద్దకుంట తండాకు చెందిన పాత్లవత్ పెంట్యా(29) ఈనెల 24న అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుడికి చూయించుకున్న అనంతరం పెంట్యా చటాన్‌పల్లిలోని తన మేనమామ కొడుకు మల్లేశ్ ఇంటికి వెళ్లాడు. అక్కడ మల్లేశ్ కుటుంబ సభ్యులకు పెంట్యాకు గొడవ జరగడంతో విషయం తెలిసిన పెంట్యా భార్య తన తమ్ముడికి సమాచారం ఇవ్వడంతో తమ్ముడితో పాటు అతడి స్నేహితుడు.. చటాన్‌పల్లికి చేరుకొనిఅదే రాత్రి పెంట్యాను పెద్దకుంట తండాకు తీసుకెళ్లారు. గురువారం కల్లుతాగిన పెంట్యా ఇంట్లోని గది తలుపులు మూసివేసి నిద్రపోయాడు. ఎంతకూ గదిలోనుంచి బయటకు రాకపోవడంతో భార్య సునీత కిటికీలో నుంచి చూడగా ఉరివేసుకొని ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

వారే కారణం..

ఆత్మహత్య చేసుకున్న పెంట్యాకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సమయంలో మృతుడి బంధువుల మధ్య పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘర్షణ వాతవరణం నెలకొంది. పెంట్యా ఆత్మహత్యకు చటాన్‌పల్లికి చెందిన మల్లేశ్ కుటుంబ సభ్యులే కారణమంటూ పెంట్యా బంధువులు.. మల్లేష్ కుటుంబ సభ్యులపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారికి సముదాయించి పంపిచారు.

గడీల పాలనను అంతమొందిద్దాం

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో గడీల పాలన సాగుతోందని.. దీనిని అంతం చేయాలంటే బీజేపీని గెలిపించుకుందామని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల పార్టీ కార్యాలయాన్ని శనివారం భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కర్ణాటక ఎమ్మెల్సీ మునిరాజగౌడ, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిసి రఘునందన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నంతో పాటు రాష్ట్రంలో బీజేపీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, నాయకులు అశోక్‌గౌడ్, ప్రతాప్, నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, అర్జున్‌రెడ్డి, పాపయ్యగౌడ్, వీరస్వామిగౌడ్, ఎంపీ యాదగిరి, సురేఖా, రమాదే, నాయకులు పాల్గొన్నారు.
